క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న నాగపద్మిని

పుంగనూరు: ప్రభుత్వం నిర్దేశించిన ధరల మేరకు ఎరువులు, మందులు రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని హెచ్చరించారు. మంగళవారం రైతు శిక్షణ కేంద్రం ఏడీ ప్రసన్న లక్ష్మి, స్థానిక ఏఓ రాజేష్‌తో కలసి ఆమె ఎరువులు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ నిల్వలు, ధరల పట్టి, విక్రయ బిల్లులను పరిశీలించారు. విక్రయించిన ప్రతి వస్తువుకు బిల్లు ఇవ్వాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఆర్బీకే అధికారి జయశ్రీ పాల్గొన్నారు.

కల్లూరు విద్యార్థి ప్రతిభ



అబ్బాస్ సలామత్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న అబ్బాస్ సలామత్ జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో జరిగిన ఈఈఎంఎస్ (ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టెస్ట్)లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. ప్రిలిమ్స్ డిసెంబర్ 15న, మెయిన్స్ జనవరి 19న జరిగిన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాలో మొదటి స్థానం సాధించారన్నారు. ఈనెల 8న విజయవాడలో నిర్వాహకులు (ప్రైజ్‌మనీ రూ.8వేలు)ఆ విద్యార్థికి అందజేస్తారని తెలిపారు. సహకరించిన ఉపాధ్యాయులను హెచ్ఎం అభినందించారు.

పరికరాల ఉత్పత్తి స్థాయి పెంచాలి



పరికరాలను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్

కుప్పంరూరల్: విద్యార్థులు పరికరాలు తయారు చేసి వాటిపై పేటెంట్ సాధించి ఇతర దేశాలు, ప్రాంతాలకు ఉత్పత్తి చేసే స్థాయి పెంచాలని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్ అన్నారు. మంగళవారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రాజెక్టు ఎక్స్‌పో పేరిట నిర్వహించిన కేఈసీ టెక్నికల్ ఫెస్ట్–2025ను నిర్వహించారు. ఇందులో 80 మంది విద్యార్థులు తయారు చేసిన సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, హోమ్ ఆటోమేషన్, డ్రోన్ టెక్నాలజీ, రాడార్ల టెక్నాలజీకి సంబంధించిన 28 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రాజెక్టులను కుప్పం జూనియర్ కళాశాల, కుప్పం డిగ్రీ కళాశాల, మోడల్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ప్రిన్సిపల్ డా. సుధీకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చారాలలో ముగిసిన తిరునాళ్ల



తిరునాళ్లలో భక్తుల కిటకిట

చౌడేపల్లె: మండలంలోని చారాల సమీపంలో వెలసిన అన్నపూర్ణాంభ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం కోలాహలంగా తిరునాళ్ల ముగిసింది. రథసప్తమి పురస్కరించుకుని ఆలయంలో తిరునాళ్లలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. యువకులు ఉట్లోత్సవంలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. స్వామివారిని నంది వాహనంపై గ్రామంలో ఊరేగించారు.

రాష్ట్ర అపుస్మా ఈసీ మెంబర్‌గా ముర్వత్ బాషా



పులిచెర్ల(కల్లూరు): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఉపాధ్యాయుల అసోషియేషన్ (అపుస్మా) సంఘ ఈసీ మెంబరుగా మంగళంపేటకు చెందిన షేక్ ముర్వత్ బాషా నియమితులయ్యారు. కార్యవర్గాన్ని అసోషియేషన్ విడుదల చేసిందని ఆయన తెలిపారు.

పెద్దపంజాణి: చెన్నారెడ్డిపల్లెలో విహరిస్తున్న స్వామి అమ్మవార్లు, కుప్పం: హనుమంత వాహనంపై వరదరాజస్వామి, బైరెడ్డిపల్లె: రథాన్ని లాగుతున్న భక్తులు, దేవళంపేటలో గ్రామోత్సవం









వైభవంగా రథసప్తమి వేడుకలు

రథసప్తమి వేడుకలను ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. సప్త వాహనాల్లో వేంకటేశ్వర స్వామి విహరించారు. భారీ సంఖ్యలో భక్తులు వాహనసేవల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

- సప్త వాహనాలపై విహరించిన మలయప్పస్వామి

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. భక్తులు శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: చెన్నారెడ్డిపల్లి కోదండరామాలయం, కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాల్లోని సీతా రామలక్ష్మణులు, విశాలాక్షి విశ్వేశ్వరస్వాముల వారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌లో మునీశ్వరస్వామి కొండచుట్టూ ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



చౌడేపల్లెలో..



పుంగనూరు: సూర్యప్రభపై స్వామివారి చిద్విలాసం

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: దాసార్లపల్లె సమీపంలో వెలసిన శ్రీధ్యానాభిరామస్వామి ఆలయంలో స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై సీతా, లక్ష్మణ సమేత శ్రీ ధ్యానాభిరామస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయం చుట్టూ రథాన్ని లాగారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: కనమనపల్లిలోని శ్రీదేవి భూదేవి శ్రీనివాసుని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాయ పుణ్యకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని హరిమందిరం సమీపంలోగల కోనేరులో ఆర్యవైశ్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు. హరిమందిరంలోని సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులను శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

వైభవం.. సప్త వాహన సేవ



కుప్పంరూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నెలకొన్న వరదరాజస్వామి ఆలయంలో మంగళవారం వైభవంగా సప్తవాహన సేవ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీ కోమలవల్లి పెరిందేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను సప్త వాహనాలపై లక్ష్మీపురం పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కోలాహలం..గంగ జాతర

బైరెడ్డిపల్లె: మండలంలోని విరూపాక్షపురంలో సోమవారం రాత్రి కోలాహలంగా గంగజాతర నిర్వహించారు. అమ్మవారి శిరస్సుకు గ్రామ పొలిమేరల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్టించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రుణాల మంజూరుపై సమావేశం



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కమిషనర్

పలమనేరు: పట్టణంలోని పలు బ్యాంకు మేనేజర్లతో స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకు రుణాల మంజూరుపై సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అర్హతగల బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ రుణాలపై ఆయన చర్చించారు. పలువురు బ్యాంకర్లు, మెప్మా సీఎంఎం బాబా పాల్గొన్నారు.

నేటి నుంచి సెల్వరాయ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి సెల్వరాయస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈనెల 11 దాకా నిర్వహించనున్నారు. ఆమేరకు ఇందుకు సంబంధించిన బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆలయం వద్ద ఆవిష్కరించారు.

పన్ను చెల్లించని వాహనాలకు జరిమానా

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఇరువారం, వేలూరు రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం రవాణాశాఖ అధికారులు వాహనాల తనిఖీలు చేశారు. వాహన పన్ను చెల్లింపులు, రికార్డులను క్షుణ్ణంగా చూశారు. పన్ను చెల్లించని 9 వాహనాలకు భారీ మొత్తంలో జరిమానా విధించినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రిజర్వేషన్‌కు తిలోదకాలు?

- జీసీ మహిళలకు ఇప్పటికే ఖరారు
- మార్కెట్ చైర్మన్ రిజర్వేషన్ మార్పునకు యత్నం
- జనరల్‌కు దక్కేలా పావులు
- అయోమయంలో టీడీపీ బీసీ నేతలు
- చైర్మన్ కుర్చీపై వీడని ఉత్కంఠ



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను చైర్మన్ ఏఎంసీ కుర్చీపై పడింది. తాజాగా జిల్లాలోని పది మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఆమేరకు పలమనేరు ఏఎంసీ బీసీ మహిళలకు కేటాయించారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల పంపకాలుంటాయని కూటమి నేతలు సైతం చెప్పుకొచ్చారు. దీంతో నియోజకవర్గంలోని పలువురు పార్టీ కోసం కష్టపడిన బీసీ నాయకులు ఏఎంసీ కుర్చీపై ఆశలు పెట్టుకున్నారు. వారి వారి స్థాయిలో ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కానీ ఈ పదవి ఎలాగైనా దక్కించుకోవాలని భావించిన ఓ సీనియర్ నేత ఇక్కడి ఓ మైనింగ్ కాంట్రాక్టర్ ద్వారా ఏఎంసీ రిజర్వేషన్‌ను బీసీ మహిళ నుంచి మార్చి జనరల్ చేసుకునేందుకు అమరావతిలో ఇప్పటికే టీడీపీ అధినేత సతీమణి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న ఇక్కడి టీడీపీ బీసీ ఆశావహులు తమ కడుపులు కొట్టారని అగ్గి మీద గుగ్గిలమవుతున్నట్టు తెలిసింది. ఎన్నో ఏళ్లుగా టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న ఆపార్టీ సీనియర్ బీసీ నాయకులు ఆశలు రిజర్వేషన్ మారడంతో ఏమీ చేయాలో అర్థంగాని పరిస్థితిల్లో అయోమయంలో పడ్డారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.70లక్షలు ఉండగా ఇందులో బీసీల ఓట్లే లక్షా 30 వేలకు పైగా ఉన్నాయి. దీంతో ఏఎంసీ చైర్మన్ కుర్చీ విషయం అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారినట్టు ఆ పార్టీ వారే చర్చించుకుంటున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వచ్చినందునే పోటీ...

పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద 33 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్‌ను రూ.55 కోట్లతో నిర్మించనున్నారు. ఇది జిల్లాలోనే మోడల్ మార్కెట్‌గా చేయాలని మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. హైవేకు ఆనుకుని వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నారు. మార్కెట్‌కు వచ్చిన కూరగాయలను అక్కడికక్కడే ప్యాకింగ్, గ్రేడింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల సౌకర్యార్థం క్యాంటీన్లు, రైతు విశ్రాంతి గదులు నిర్మాణాలు ఉంటాయి. దీనికి సమీపంలోనే పశువులు, గొర్రెల వారపుసంతలుంటాయి. ఈ మోడల్ మార్కెట్‌కు సంబంధించిన పనులు కొత్త ఏఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉంటుంది. దీంతో తమకంటే తమకంటూ స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలను మించి టీడీపీ అధిష్టాన కీలక నేతల దాకా ఈ విషయం వెళ్లిందనే మాట వినిపిస్తోంది. అయితే ఇప్పటికే ఖరారు చేసినట్టు బీసీ మహిళకు ఈ పదవి దక్కనుందా లేదా అధికార పార్టీ వత్తాసుతో రిజర్వేషన్ మారనుందా అనే విషయం స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై స్థానిక ఏఎంసీ కార్యదర్శి సంజీవకుమార్‌ను వివరణ కోరగా ఇప్పటిదాకా ఇక్కడి చైర్మన్ రిజర్వేషన్ బీసీ మహిళగానే ఉందన్నారు. కానీ మళ్లీ రిజర్వేషన్ మారిన జీఓ ఇంకా తమకు అందలేదని ఏదైనా ఉత్తర్వులందితే ముందుగా మీకే చెబుతామన్నారు.

సచివాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట సచివాలయాన్ని ఎంపీడీఓ బాలాజి మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు రికార్డులు సక్రమంగా నిర్వహిస్తూ సమయ పాలన పాటించాలని తెలిపారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న వివిధ సర్వే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం పెద్దకాప్పల్లి పంచాయతీలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పీఎస్ వినోద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంసీఓ సుధాకర్ పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో రక్ష

- తొలిదశలో కేన్సర్ గుర్తిస్తే నివారణ సాధ్యమే
- మెడికల్ ఆఫీసర్ డా.సుధారాణి



రొంపిచెర్ల: ర్యాలీలో వైద్య సిబ్బంది



పలమనేరులో రూరల్ హెల్త్ ప్రొవైడర్స్ ర్యాలీ

పలమనేరు: ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్ నివారణ సాధ్యమేనని పలమనేరు మండల వైద్యాధికారిణి డా.సుధారాణి సూచించారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొలమాసనపల్లిలో మంగళవారం అవగాహన ర్యాలీ, సమావేశాన్ని నిర్వహించారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.వెంకటేశులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొలమాసనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది మధు, విజయ, రతి, ప్రసాద్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, అధ్యాపకులు జయశంకర్, హేమలత, శశికళ, నేజర్, ఆర్ఎంపీ ప్రొవైడర్స్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, కన్వీనర్ మనోహర్, కో కన్వీనర్ వాసుదేవన్ పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: పీఈఎస్ మెడికల్ కళాశాలలో కేన్సర్ వ్యాధిపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ డా. ఆర్.సుబ్బారావు, వైద్యులు అభిరామి, డానియల్ అరుణ్, శ్రీదేవి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, సీహెచ్ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గిరీష, సదుం సీహెచ్‌సీ డాక్టర్ పుష్పకుమారి, కృష్ణారెడ్డి, సిబ్బంది ఉదయ భాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: తీర్థం పీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ, సీహెచ్ఓ అనూరాధ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



సదుంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొలమాసనపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ



తీర్థంలో ర్యాలీ



గుడుపల్లె: పీఈఎస్‌లో..

కూటమి తీరు మారింది



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

సదుం: అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వ తీరు మారిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు మున్నా ఆరోపించారు. సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా అరెస్టు చేయడానికి నిరసనగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి మంగళవారం నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో సీఎం సభలో నిరసన తెలిపిన మాధవ్‌ను అరెస్టు చేయడం దారుణమని ఆయన చెప్పారు. బహిరంగ సభలో సీఎం చేసిన చులకన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విడుదల చేయకుంటే విజయవాడలో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్ చంద్, మన్సూర్, నేతలు డోనా, శివ, ఫౌజియా, స్వాతి, సమీరాబాను, అల్ఫియా, మధుమతి, సాధిక్, శివతేజ పాల్గొన్నారు.

రక్షణ కవచం హెల్మెట్



మాట్లాడుతన్న ఎంవీఐ మధుసూదన్

పలమనేరు: మీ ప్రాణానికి హెల్మెట్ రక్షణ కవచమని పలమనేరు ఎంవీఐ మధుసూదన్ సూచించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా స్థానిక ఎలీనాబెట్టిని స్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని రవాణాశాఖ నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకనే తలకు దెబ్బ తగిలి చాలామంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, అతివేగం, సీటు బెల్టు వేసుకోకుండా వెళ్లడం వంటి కారణాలతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదం జరిగిన గంటలోపు క్షతగాత్రులకు వైద్యం అందివ్వాల్సి ఉంటుందని, ప్రమాదం జరిగిన వెంటనే వారిని ఆస్పత్రికి చేర్చేందుకు సాటి మనిషిగా సాయం చేయాలన్నారు. రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

